
సాక్షి
శ్రీకాకుళం
ఆదివారం । 23 । మార్చి । 2025



భక్తి, త్యాగాలసమ్మిళితం రంజాన్
భక్తి, త్యాగాల సమ్మిళితం రంజాన్. ఈ మాసమంతా ప్రత్యేకమే. - 8లో



పెట్రోల్ బంకుల్లో తనిఖీలు
జిల్లాలోని పలు పెట్రోల్ బంకులను అధికారులు తనిఖీ చేశారు. 'సాక్షి' వార్తకు స్పందించారు. - 8లో





దబ్బపాడులో చలమల నీటిని తాగుతూ..

ప్రజలం దరిదీ ఒకటే సమస్య

మున్సిపాలిటీల్లో దాహం కేకలు

సాక్షి గ్రాండ్ రిపోర్ట్

ఇంటిలో ఖాళీ బిందెలు, వీధిలో ట్యాంకర్ల వద్ద గొడవలు, వార్డుల్లో దాహం కేకలు.. వెరసి పురాల్లో 'నీరు'త్సాహం కమ్ముకుంటోంది. శ్రీకాకుళం నుంచి ఇచ్ఛాపురం వరకు, కార్పొరేషన్ నుంచి మున్సిపాలిటీల వరకు ప్ర'జలం'దరిదీ ఒకటే సమస్య. కుళాయిల ద్వారా వస్తున్న నీరు సరిపోక, ట్యాంకర్ల ద్వారా నిత్యం నీటి సరఫరా జరగక గొంతులు ఎండుతున్నాయి. మరీ ముఖ్యంగా శివారు ప్రాంతాల వాసుల ఇళ్లలో ఖాళీ బిందెలు వెక్కిరిస్తున్నాయి.



ఆమదాలవలస: పార్వతీశ్వరునిపేట వద్ద తాగునీటి ట్యాంకర్ కోసం పడిగాపులు కాస్తున్న మహిళలు

దాహం దాహం — ఆమదాలవలస

ఆమదాలవలస: ఆమదాలవలస మున్సిపాలిటీలో దాహం కేకలు మొదలయ్యాయి. ఇక్కడి 23 వార్డుల్లో రోజుకు రెండుసార్లు కుళాయిల ద్వారా తాగునీరు అందించాలి. అయితే పట్టణంలో రోజుకు ఒకసారి ఉదయం పూట కొన్నివార్డులకు, సాయంత్రం పూట కొన్ని వార్డులకు మంచినీటిని సప్లై చేస్తున్నారు. ఒకటోవార్డులోని తిమ్మాపురం, జగ్గిశాస్త్రులపేట, పార్వతీశ్వరునిపేట, 4వ వార్డులోని గేదెలవానిపేట, కొరింవలస పేట, 5వ వార్డు రెడ్డిపేట, సొట్టవానిపేట, పంతులపేట, 6వ వార్డు సప్తపురాలు, నందగిరిపేట, తురకపేట, టి.మన్నయ్యపేట, కె.మన్నయ్యపేట, కంచరాపువానిపేట, 7 వ వార్డు చింతాడ, చింతాడ ఎస్సీ కాలనీ, మెయిన్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో తాగునీటి పైపులైన్లు లేక ఆయా ప్రాంతాలకు ట్యాంకర్లతోనే తాగునీరు అందిస్తున్నారు.

వార్డులు :	23
జనాభా:	49 వేలు
రోజుకు అవసరమైన తాగునీరు :	56 లక్షల లీటర్లు
సరఫరా చేస్తున్న నీరు :	45.25 లక్షల లీటర్లు



మున్సిపాలిటీ పరిధి 7వవార్డు చింతాడ గ్రామంలో తాగునీటికోసం ట్యాంకర్ వద్ద పడిగాపులు

వారానికోసారి ట్యాంకర్



గతంలో తాగునీరు టాంకర్లతో ప్రతిరోజూ పూర్తి స్థాయిలో అందించేవారు. ప్రస్తుతం మా పార్వతీశ్వరుని పేట గ్రామానికి వారం రోజులకు ఒకసారి మాత్రమే ట్యాంకర్‌తో తాగునీరు వస్తోంది. రోజూ నీటి కష్టాలు తప్పడం లేదు.

– సుంకరి శ్రీలత, పార్వతీశ్వరుని పేట, ఆమదాలవలస మున్సిపాలిటీ ఒకటోవార్డు

నీరు..కన్నీరు





వారు ఉండేది వంశధార తీరంలో. కానీ తాగునీటికి ఎప్పుడూ కటకటే. అక్కడో మెగా రక్షిత తాగునీటి పథకం ఉంది. కానీ కుళాయిలు ఎప్పుడూ ఏడుస్తూనే ఉంటాయి. ఆ నీటిబొట్లు దాహం తీర్చవు. ఎల్ఎన్ పేట మండలం దబ్బపాడులోని చలమల నీటికోసం మహిళల పడుతున్న ఇబ్బందులు ఇవీ.

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం



శ్రీకాకుళంలో పరిస్థితి..

కావాలి జలం — శ్రీకాకుళం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): మున్సిపాలిటీ నుంచి కార్పొరేషన్‌గా స్థాయి పెరిగినా జిల్లా కేంద్రంలో తాగునీటి కష్టాలు తప్పడం లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో రూ 5.60కోట్లతో పంపుహౌస్, గ్యాలరీ నిర్మాణం చేశారు. దీన్ని పూర్తిస్థాయిలో వాడుకలోకి తీసుకొస్తే నగరవాసులకు ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చి తాగు నీటితో పాటు నిత్యం వాడుకలకు కావాల్సిన నీరు అందించవచ్చు. కానీ అధికార పార్టీ నేతలు ఆ ప్రయత్నం చేయడం లేదు. ఏడు విలీన పంచాయతీలకు కేవలం 4 ట్యాంకర్లతో 60వేల లీటర్లు మాత్రమే నీరు సరఫరా చేస్తున్నారు.

నగరపాలక సంఘంలోని డివిజన్‌లు :	50
జనాభా:	1.86 లక్షలు
రోజుకు అవసరమైన తాగునీరు :	23.62 కోట్ల లీటర్లు
సరఫరా చేస్తున్న నీరు :	18.82 కోట్ల లీటర్లు

ఎప్పుడొస్తాయో..



ట్యాంకర్లతో నీళ్లు ఏ సమయంలో వస్తాయో తెలియదు. వచ్చినా ఎవరైతే గంటల కొద్దీ కలబడగలరో వారికే దొరుకుతుంది. ట్యాంకర్ రెండు మూడు సార్లు వస్తే గాని మా ఊరందరికి నీళ్లు సరిపోవు.

– బద్దీ లక్ష్మి, పెద్దపాడు, శ్రీకాకుళం కార్పోరేషన్.

అందరికి తాగునీరు అందిస్తాం..



వేసవిని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరికీ తాగునీరు అందించడమే మా లక్ష్యం. ప్రస్తుతం ఉన్న అన్ని వనరులు వినియోగించి తాగునీరు సరఫరా చేస్తున్నాం. రానున్న ఎండల దృష్ట్యా మరింత పక్కాగా ఏర్పాట్లు చేసి తాగునీటికి ఇబ్బంది లేకుండా చేస్తాం.

– పి.వి.వి.డి ప్రసాదరావు, కమిషనర్, శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్

రెండు రోజులకు ఒకసారి.. — ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం: పురపాలక సంఘం పరిధిలో రెండు రోజులకు ఒకసారి గానీ నీరు రావడం లేదు. 23 వార్డులున్న మున్సిపాలిటీలో 50వేలకుపైగా జనాభా ఉన్నారు. మొదటి మూడు వార్డులు గల పురుషోత్తపురం, అమీన్ సాహెబ్‌పేట, బోర్డర్‌లతో పాటు రత్తకన్న గ్రామంలోని 18,19,2 వార్డులకు తీవ్రంగా నీటి ఎద్దడి ఉంది. వేసవిలో ఈ కష్టాలు మరింత పెరుగుతాయి. వేసవిలో తాగునీటి సమస్యను అధిగమించడానికి బాహుదా నదిలో ఇన్‌ఫిల్‌ట్రేషన్ బావుల వద్ద రూ.2లక్షలతో రివర్ బెడ్ ఏర్పాటు చేయడానికి, అదేవిధంగా 2వేల లీటర్ల సామర్థ్యం గల ప్రైవేటు ట్యాంకర్లను అద్దెకు తీసుకొని వాటి ద్వారా తాగునీటిని సరఫరా చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు.

పురపాలక సంఘంలోని వార్డులు :	23
జనాభా:	50 వేలు
రోజుకు అవసరమైన తాగునీరు :	35 లక్షల లీటర్లు
సరఫరా చేస్తున్న నీరు :	21 లక్షల లీటర్లు

మూడు రోజులకు ఒకసారి.. — కాశీబుగ్గ

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో ఉన్న 31వార్డుల్లో మూడు రోజులకు ఒకసారి మాత్రమే తాగునీటి సరఫరా జరుగుతోంది. 31 వార్డుల్లో దాదాపు 75వేల మంది నివాసం ఉంటున్నారు. పదిహేనేళ్ల కిందట వేసిన పెద్దబావులే వీరికి నీటికి ఆధారం. అవి అడుగంటడంతో వారానికి మూడుసార్లు మాత్రమే నీరు అందించగలుగుతున్నారు. 1746 కుళాయిలు ఉండగా వాటిలో 500 వరకు అక్రమమని చెబుతున్నారు. వాటర్‌గ్రిడ్ ప్రాజెక్టుకు అనుసంధానం చేస్తామని ప్రకటించినా పనులు ప్రారంభం కాలేదు.



సూదికొండలో తాగునీటి కోసం వీధిలో డ్రమ్ములు

అంకెల్లో...	
వార్డులు :	31
జనాభా :	75 వేలు
రోజుకు అవసరమైన తాగునీరు:	80లక్షల లీటర్లు
సరఫరా చేస్తున్న నీరు :	30 లక్షల లీటర్లు

జీడి కార్మికులకు తాగునీరు అందించండి



సూదికొండ సచివాలయం పరిధిలో ఉన్న 2వవార్డు, 19వవార్డు, 20వార్డుల పరిసర ప్రాంతాల్లో అత్యధికంగా జీడి కార్మికులు నివాసం ఉంటున్నారు. అందరూ నిరుపేదలు కావడంతో ఇంటి అద్దెలు భరించలేకపోతున్నారు. దీంతో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

– బమ్మిడి సంతోష్, కో– ఆప్షన్ సభ్యులు, పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ



అమీన్‌సాహెబ్‌పేటలో మున్సిపల్ వాటర్ ట్యాంకర్ వద్ద తాగునీటిని పట్టుకుంటున్న ప్రజలు

చూచి రాత.. వ్యవహారమంతా రోత

- కుప్పిలి ఆదర్శ పాఠశాలలో సంచలనంగా మారిన మాస్ కాపీయింగ్
- కాపీయింగ్ వెనుక ఓ బోధనేతర ఉద్యోగి
- ముందస్తు ప్రణాళికతోనే కాపీ జరుగుతున్నట్లు ఆరోపణలు
- పరీక్ష కేంద్రంపై గట్టి నిఘా



కుప్పిలి మోడల్ స్కూల్

ఎచ్చెర్ల క్యాంపస్:

కుప్పిలి ఆదర్శ పాఠశాల పరీక్ష కేంద్రంలో మాస్ కాపీయింగ్ రాష్ట్రంలో సంచలనంగా మారింది. పరీక్ష కేంద్రాన్ని డీఈఓ తిరుమల చైతన్య ఆధ్వర్యంలో నాలుగు స్క్వాడ్ బృందాలు ఆకస్మికంగా తనిఖీ చేయడం, ఐదుగురు విద్యార్థులు స్లిప్‌లు చూస్తూ పట్టు బడటం, వారిని డీబార్ చేయటం జరిగింది. అయితే పరీక్ష రాస్తున్న గదుల బయట ఎక్కువ సంఖ్యలో స్లిప్‌లు తనిఖీ అధికారుల కంట బడ్డాయి. ఇన్విజిలేటర్లు అప్రమత్తం చేయటంతో కిటికీల నుంచి, బయటకు వచ్చి విద్యార్థులు విసిరేశారు. విసరడం సాధ్యం కాని విద్యార్థులు మాత్రమే దొరికిపోయారు. ముందస్తు ప్రణాళికతోనే ఇక్కడ మాస్ కాపీయింగ్ జరుగుతున్నట్లు సమాచారం. దీనిపై ఉన్నతాధికారులు విచారణ నిర్వహిస్తున్నారు.

కుప్పిలి ఆదర్శ పాఠశాల శ్రీకాకుళం నగరానికి 20 కిలోమీటర్ల దూరంలో ఉంది. గ్రామానికి సైతం కిలోమీటరు దూరంలో సముద్ర తీరం ఉంది. సాధారణంగా అధికారుల పర్యవేక్షణకు అవకాశం లేదు. కానీ ఇక్కడ మాస్ కాపీయింగ్ జరుగుతున్నట్లు ఆరోపణలు రావడంతో.. ఈ సారి పక్కాగా అధికారులు పాఠశాలలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. అధికారులు ఊహించినట్టే చూచి రాతలు బయట పడ్డాయి. అలాగే ప్రశ్న పత్రాలు బయటకు రావటం, ప్రశ్నలు ఆధారంగా ఉపాధ్యాయులే జవాబులు సిద్ధం చేసి జిరాక్సులు స్లిప్పులు రూపంలో విద్యార్థులకు చేరవేయటం గమనార్హం.

బోధనేతర ఉద్యోగే కీలకం..

మరో పక్క 14 మంది ఉపాధ్యాయులను సస్పెండ్ చేశారు. ఇందులో ముగ్గురు హెచ్ఎంలు ఉన్నారు. వీరితో పాటు ఒక నాన్ టీచింగ్ సిబ్బందిని కూడా సస్పెండ్ చేశారు. చూచి రాతల్లో నాన్ టీచింగ్ వ్యక్తి కీలకంగా వ్యవహరించినట్లు సమాచారం. విద్యార్థుల నుంచి, పరీక్షకు హాజరైన విద్యార్థుల పాఠశాలల నుంచి సైతం డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు నిశిత పరిశీలన చేస్తున్నారు.

ట్రిపుల్ ఐటీ సీట్ల కోసమేనా..?

పాఠశాలల్లో మెరుగైన ఫలితాలు, 10వ తరగతి పరీక్షల్లో ఎక్కువ మార్కులు సాధించడమే ఈ మాస్ కాపీయింగ్ లక్ష్యం. ముఖ్యంగా ట్రిపుల్‌ఐటీలో అధిక సంఖ్యలో ప్రవేశాల కోసం ఇలా చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కుప్పిలి మోడల్ స్కూల్‌లో ఏ, బీ పరీక్ష కేంద్రాలు నిర్వహిస్తున్నారు. ఏ పరీక్ష కేంద్రంలో 207, బీ పరీక్ష కేంద్రంలో 218 మొత్తం 425 మంది విద్యార్థులు పరీక్ష రాస్తున్నారు. ఈ సమీపంలోని పాఠశాలల విద్యార్థులు మొత్తం ఈ పాఠశాలలోనే రాస్తున్నారు. సోమవారం గణితం పరీక్ష నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో పరీక్షల నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు. కఠినంగా వ్యవహరించే సిట్టింగ్ స్క్వాడ్‌లు, పరిశీలకులు, చీఫ్ సూపరింటెండెంట్ వ్యవస్థ, ఇన్విజిలేటర్లు, మరో పక్క పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు వంటి అంశాలను అధికారులు పరిశీలిస్తున్నారు. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసే వాతావరణం సైతం ఇక్కడ అవసరం.

15కు చేరిన సస్పెన్షన్ల సంఖ్య

శ్రీకాకుళం న్యూకాలనీ: కుప్పిలి మోడల్ స్కూల్ మాస్ కాపీయింగ్ కేసులో సస్పెండైన వారి సంఖ్య 15కు చేరింది. మాల్‌ప్రాక్టీసులకు సహకరిస్తున్నారే అభియోగాలతో కుప్పిలి జెడ్పీహెచ్‌స్కూల్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కిశోర్‌ను శనివారం సస్పెండ్ చేస్తూ డీఈఓ ఉత్తర్వులు జారీ చేశారు.

ఆరుగురిపై క్రిమినల్ కేసులు

ఎచ్చెర్ల క్యాంపస్: కుప్పిలి మోడల్ పాఠశాలలో విద్యార్థుల మాస్ కాపీయింగ్‌కు ఉపాధ్యాయులు సహకరించారని శ్రీకాకుళం డీఈఓ తిరుమల చైతన్య ఎచ్చెర్ల పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు క్రిమినల్ కేసులు నమోదు చేశారు. ఐదుగురు ఉపాధ్యాయులతోపాటు మరికొందరి పాత్ర ఉందని డీఈఓ ఫిర్యాదు చేయగా, ఎఫ్ఐఆర్‌లో ఎం.కనకరాజు, ఎస్.కృష్ణ, పి.నాగేశ్వరరావు, కె.కామేశ్వరరావు, కె.పద్మావతి, బి.కృష్ణకిశోర్ పేర్లు నమోదు చేశారు. ఫిర్యాదుపై సమగ్ర దర్యాప్తు చేయనున్నట్లు ఎస్ఐ వి.సందీప్‌కుమార్ చెప్పారు. ఈ జాబితాలోకి మరికొందరిని చేర్చనున్నట్లు సమాచారం.

స్కూల్‌లో చాలని మధ్యాహ్న భోజనాలు



మెళియాపుట్టి: చాపర జిల్లాపరిషత్ పాఠశాలలో హోటల్ మీల్స్ తింటున్న విద్యార్థులు

మెళియాపుట్టి: మండలంలోని చాపర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం మధ్యాహ్న భోజనాలు చాలలేదు. దీంతో హోటల్ నుంచి పార్శిళ్లు తీసుకువచ్చి విద్యార్థులకు భోజనం పెట్టారు. శనివారం పాఠశాలకు వచ్చిన విద్యార్థుల సంఖ్య తెలియకుండానే వంట చేయడంతో సుమారుగా 15 మంది విద్యార్థులకు అన్నం సరిపోలేదు. దీంతో మధ్యాహ్న భోజన వంట నిర్వాహకులు హోటల్ నుంచి తీసుకొచ్చి పెట్టారు. టెన్త్ పరీక్షలు ప్రారంభమైన నాటి నుంచి 170 మందికి మాత్రమే వంట చేయడానికి బియ్యం ఇస్తున్నారని వంట నిర్వాహకులు చెబుతున్నారు. దీనిపై హెచ్ఎం ఎం.సలాన చిట్టిబాబును వివరణ కోరగా తాను శ్రీకాకుళం వెళ్లానని, వంట నిర్వాహకులు సరుకులు పక్కదారి పట్టిస్తున్నారని, చెప్పినా వినడం లేదని తెలిపారు. స్కూల్ అసిస్టెంట్ ప్రసాద్‌కు బాధ్యతలు అప్పగించానని పేర్కొన్నారు. ఆయనను వివరణ కోరగా 170 మందికి బియ్యం ఇచ్చానని, తిన్నవారికే గుడ్లు, చెక్కీలు ఇవ్వాలని, తినని విద్యార్థులకు ఇవ్వవద్దని ప్రభుత్వం చెబుతోందని 'సాక్షి'కి తెలిపారు.

క్లుప్తంగా

విద్యుత్ పొదుపుతోనే భవిష్యత్తు


విద్యుత్తు బల్బు ఆకారంలో విద్యార్థుల మానవహారం

పలాస: భూతాపాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరు విద్యుత్తును పొదుపుగా వాడాలని పలాస మండలం బ్రాహ్మణతర్లా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఎస్వీ రమణరావు పిలుపునిచ్చారు. శనివారం ఎర్త్ అవర్ సందర్భంగా పాఠశాలలోని జాతీయ హరితక్లబ్, జూనియర్ రెడ్ క్రాస్‌క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో విద్యార్థులు విద్యుత్తు బల్బు ఆకారంలో మానవహారంగా ఏర్పడ్డారు. ప్రతి ఒక్కరు రాత్రి 8.30 నుంచి 9.30 గంటల వరకు విద్యుత్తు ఉపకరణాలను గంట పాటు ఆపి ఎర్త్ అవర్ పాటించాలని కోరారు. ఎన్జీసీ క్లస్టర్ కోఆర్డినేటర్ కొయ్యల శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ పరిశ్రమలో అగ్నిప్రమాదం


కాలిపోతున్న పరిశ్రమ

జి.సిగడాం: మండలంలోని సంతవురిటి గ్రామంలో శనివారం ఉదయం ప్లాస్టిక్ పరిశ్రమలో అగ్నిప్రమాదం సంభవించింది. శ్రీరామ ప్లాస్టిక్ పరిశ్రమలో విద్యుత్‌షార్టు సర్క్యూట్‌తో జరిగిన అగ్ని ప్రమాదంలో మెషినరీ, స్టాక్ షెడ్ అగ్నికి ఆహుతయ్యాయి. రూ.20 లక్షల వరకు ఆస్తి నష్టం ఉంటుందని కంపెనీ నిర్వాహకురాలు బత్తుల దేవయాని చెబుతున్నారు. సమాచారం అందుకున్న పొందూరు అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన వెళ్లి మంటల్ని అదుపులోకి తెచ్చారు. ప్లాస్టిక్ పరిశ్రమ కావడంతో శనివారం సాయంత్రం వరకు మంటలు చెలరేగుతునే ఉన్నాయి.

అగ్నిప్రమాదంలో ఇల్లు దగ్ధం


కాలిపోయిన ఇల్లు

కంచిలి: మండల కేంద్రం కంచిలి పంచాయతీ పరిధి బలియాపుట్టుగ కాలనీలో శుక్రవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో రీనా బెహరాకు చెందిన ఇల్లు దగ్ధమైంది. వివరాల్లోకి వెళ్తే.. రీనా బెహరా, బైరాగి దంపతులు, ముగ్గురు కుమార్తెలతో కలిసి ఇంట్లో నివాసముంటున్నారు. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. భార్య భర్తలు రోజు కూలీ చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. రోడ్డు ప్రమాదం జరగడంతో బాధితులు రోడ్డున పడ్డారు. దాతల సాయం కోసం ఎదురు చూస్తున్నారు. పరిస్థితి తెలుసుకున్న మాజీ ఎంపీటీసీ సభ్యుడు కొత్తకోట శేఖర్, స్నేహితులు ఆదివారం బాధితులను పరామర్శించారు. శేఖర్ రూ.10వేలు, కొల్లి తాతయ్య, బతకల ధర్మారావులు చెరో వెయ్యి రూపాయలు చొప్పున బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సునీల్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయితో ఇద్దరు అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

కాశీబుగ్గ: పలాస రైల్వేస్టేషన్ రోడ్డులో శనివారం మధ్యాహ్నం గంజాయిని తరలిస్తున్న ఇద్దరు ఒడిశా యువకులను కాశీబుగ్గ పోలీసులు పట్టుకున్నారని డీఎస్పీ వి.వెంకట అప్పారావు తెలిపారు. శనివారం కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లాకు చెందిన జల్సన్ ఆనంద్, మోజేష్ కుమార్‌లు గంజాయి రవాణా చేసేందుకు సిద్ధంగా ఉండగా కాశీబుగ్గ సీఐ సూర్యనారాయణ, సిబ్బంది అరెస్టు చేశారని చెప్పారు. వారి వద్ద నుంచి 7 కిలోల 800 గ్రాముల గంజాయి, 2 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

గంజాయి అక్రమ రవాణాపై కఠిన చర్యలు

శ్రీకాకుళం క్రైమ్ : గంజాయి అక్రమ రవాణా, వినియోగాన్ని నిరోధించేందుకు అధికారులు కఠిన చర్యలు అవలంబించాలని, లబ్ధిదారులుగా ఉన్న వ్యక్తుల ఆస్తులను గుర్తించి త్వరితగతిన జప్తు చేయాలని విశాఖపట్నం రేంజి డీఐజీ గోపినాథ్ జెట్టి స్పష్టం చేశారు. శనివారం రేంజి పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పీవీపీ-మన్యం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. వీడియో కాన్ఫరెన్సులో ఎస్పీలు కె.వి.మహేశ్వరరెడ్డి, తుహిన్ సిన్హా, అమిత్ బర్దార్, మాధవ రెడ్డి వారి వారి పోలీసు కార్యాలయాల నుంచి పాల్గొన్నారు.

కథనంతో కదిలారు

- పెట్రోల్ బంకుల్లో ఆకస్మిక తనిఖీలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలోని పలు పెట్రోల్ ఫిల్లింగ్‌స్టేషన్లపై అధికారులు శనివారం దాడులు చేశారు. 'సాక్షి'లో శనివారం ప్రచురితమైన 'మోసాల మీటర్ రయ్..రయ్' వార్తకు అధికారులు స్పందించారు. జిల్లా సివిల్ సప్లై అధికారులు, లీగల్ మెటాలజీ అధికారులు సంయుక్తంగా ఈ దాడులు నిర్వహించారు. శ్రీకాకుళంలోని రైతు బజారు వద్ద గల పెట్రోల్ బంకులో కొలతలు, కల్తీ, ఎథిలీన్ వంటి వాటిని పరిశీలించారు. డీఎస్‌ఓ జి.సూర్యప్రకాశరావు లీగల్ మెటాలజీ అధికారులతో దాడులు చేపట్టారు. జాయింట్ కలెక్టర్ అహ్మద్ ఫర్మాన్ ఖాన్ ఆదేశాల మేరకు ఈ విజిట్లు చేస్తున్నామని డీఎస్‌ఓ తెలిపారు. కల్తీ ఉన్నా, కొలతల్లో తేడాలు ఉన్నా చర్యలు తీసుకుంటామన్నారు. శ్రీకాకుళం నగరంలోని బంకులతో పాటుగా శనివారం రణస్థలం మండలంలోని పలు పెట్రోల్ బంకులను కూడా పరిశీలించారు.

రణస్థలం: మండలంలోని పైడిభీమవరం, నెలివాడ, రణస్థలంలో గల పెట్రోల్ బంకులను డీఎస్‌ఓ జి.సూర్య ప్రకాశరావు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రణస్థలం టౌన్‌లోని బాలాజీ ఫిల్లింగ్ స్టేషన్ హెచ్‌పీసీఎల్ పెట్రోల్ బంకును, అలాగే నెలివాడలోని ఎస్ఈఆర్ ఫిల్లింగ్ స్టేషన్ ఐవోసీఎల్ పెట్రోల్ బంకులను తనిఖీ చేశారు. కల్తీ చేయరాదని, డిజిటల్ మీటర్లు సక్రమంగా నడపాలని బంకు సిబ్బందికి ఆదేశించారు. బంకుల్లో మోసాలు జరిగితే జాయింట్ కలెక్టర్ పర్యవేక్షణలో సీజ్ చేయిస్తామని హెచ్చరించారు.


రణస్థలంలోని బాలాజీ పెట్రోల్ బంకును తనిఖీ చేస్తున్న డీఎస్‌ఓ సూర్య ప్రకాశ్‌రావు


నెలివాడలోని ఎస్ఈఆర్ పెట్రోల్ బంకును తనిఖీ చేస్తున్న అధికారులు


రణస్థలం బాలాజీ పెట్రోల్ బంకులో మిషన్ పనితీరును పరిశీలిస్తూ..

రంజాన్

భక్తి, త్యాగాల సమ్మిళితం

- పరమ పవిత్రం రంజాన్ మాసం
- నెలరోజుల ఉపవాస దీక్షలు

మాసం రోజుల పాటు కఠిన ఉపవాసం.. ఉన్న దాంట్లో కొంత ఆర్తులకు సాయం.. దేవుడిపై అచంచల విశ్వాసం.. వెరసి పవిత్ర రంజాన్ మాసం. రంజాన్ రోజుల్లో ముస్లిం సోదరుల దినచర్య ప్రత్యేకంగా కనిపిస్తుంది. ఉదయం నిద్ర లేచింది మొదలు మళ్లీ రాత్రి వరకు వారు చేసే ప్రతి పనిలోనూ దైవ ధ్యానమే కనిపిస్తూ ఉంటుంది. ప్రస్తుతం రంజాన్ మాసం నడుస్తోంది. ఈ సందర్భంగా మసీదు పరిసర ప్రాంతాలు సేమ్యాలు, అత్తర్లు, మిస్వాక్‌లు, తస్‌బీలతో కళకళలాడుతున్నాయి.

ఉపవాస దీక్ష సందర్భంగా ఇఫ్తార్ విందు తీసుకుంటున్న ముస్లింలు (ఫైల్)


శ్రీకాకుళం కల్చరల్:

ఐదు పూటలా నమాజు, సాయంత్రం ఇఫ్తార్ విందు, కలిమా పఠనం, ఫిత్రా దానం.. నెల రోజుల పాటు ముస్లిం సోదరుల దినచర్య ఇది. పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు ప్రత్యేక పద్ధతులు పాటిస్తారు. ఉపవాసం చేసిన వారి శరీరం శుష్కించి తద్వారా ఆత్మప్రక్షాళన అవుతుందని నమ్ముతారు. ఉపవాసం ద్వారా శరీరాన్ని, మనసును పవిత్రంగా ఉంచుకుని ఉదయం సూర్యోదయం లోపల, సాయంత్రం సూర్యాస్తమయం తర్వాత మాత్రమే ఆహారాన్ని తీసుకుంటారు.

జకాత్

దానం చేయగలిగిన స్థితిలో ఉన్న ప్రతి ముస్లిం తన మిగులు సంపాదనలో కొంత పేద వారికి ఇవ్వడమే ఫిత్రా అని జకాత్ అంటారు. జామియా మసీదులో ఈ ఏడాది ఫిత్రా కింద రూ.100లుగా నిర్ణయించారు. ఈ ధర రెండు కేజీల 45 గ్రాముల గోధుమతో సమానం. వెండి, బంగారు నగలు ఈ లెక్క ప్రకారం ఉంటే వాటిపై కూడా జకాత్ విధిగా చెల్లించాలి. వ్యాపార సామగ్రిపై కూడా జకాత్ చెల్లించాలి.

దంతధావనం కోసం..

ఉదయం లేవగానే ఈ మాసంలో ముస్లిం సోదరులు దంత ధావనం కోసం ప్రత్యేక పుల్లను వాడుతారు. అది పరగోగు చెట్టు వేటు ముక్కలు. ఇది వాడడం వల్ల ఆరోగ్యంతో పాటుగా ఉదయం నుంచి ఉపవాసం చేసే వాళ్లకి ఎంతో ఉపకరిస్తుంది.

తస్‌బీ

రంజాన్ మాసంలో అల్లాకు నమాజు చేసిన తర్వాత ప్రార్థన చేసేటప్పుడు లెక్కించేందుకు ఉపయోగించేది తస్‌బీ. ఇది పూసల దండ మాదిరిగా ఉంటుంది. దీన్ని చేతిలో ఉంచుకొని 101సార్లు ప్రార్థించేందుకు వినియోగిస్తారు.



జామియా మసీదు ప్రధాన ద్వారం

సెంట్లు, అత్తర్లు

రంజాన్ నెలలో సువాసనలు వెదజల్లే అత్తర్లు కొనుగోలు చేయడం పరిపాటి. దేశ విదేశాలకు చెందినవి ప్రస్తుతం పట్టణంలోనూ లభ్యమవుతున్నాయి. అత్తర్లు తయారు చేయడంలో ముస్లిం సోదరులు ప్రత్యేకంగా చెప్పుకుంటారు. ముఖ్యంగా వీటిని హైదరాబాదు ప్రాంతంలో తయారు చేస్తారు. వీటి ధరలు రూ.70లు నుంచి రూ.250 వరకు వివిధ ధరల్లో, సైజులలో లభ్యమవుతున్నాయి.

జానీమాజ్

ఇంట్లో అల్లాను ప్రార్థించేటపుడు నేలమీద కాకుండా జానీమాజ్ అనే పరదా మీద కూర్చోవాలన్నది నిబంధన. ఇవి కూడా ఆధునిక డిజైన్లలో లభిస్తున్నాయి. మసీదుకు రాని మహిళలు ఇంట్లో నమాజు చేసుకునేందుకు ఎక్కువగా వీటిని వాడుతుంటారు. వీటి ధరలు రూ.100లు నుంచి రూ.150 వరకు ఉన్నాయి.

ఐదు పూటలా నమాజ్


ప్రతి ముస్లిం ఈ నెలరోజులు 5 పూటలా నమాజు చేయాలి. నిత్యం అల్లాను స్మరిస్తూ ఉండాలి. సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు రోజుకు సుమారు 16 గంటల పాటు అన్నపానీయాలు తీసుకోకుండా ఉపవాసం సాగుతుంది. ప్రతి ముస్లిం దీన్ని పవిత్రకార్యంగా భావిస్తాడు.

– మెహీబుల్లాఖాన్, జామియా మసీదు అధ్యక్షుడు

నిరంతర దైవచింతన


ప్రార్థనల ద్వారా పాపాలను పటాపంచలు చేసి, నిరంతరం దైవ సాన్నిధ్యంలో గడపటమే ఈ మాస ముఖ్య ఉద్దేశం. భగవంతుడి ఆరాధన, సత్ప్రవర్తన, దాతృత్వం వంటి సుగుణాలు బయటపెట్టేదే రంజాన్ మాసం.

– అక్బర్ బాషా, సెక్రటరీ, జామియా మసీదు

సహర్‌లో డ్రైఫ్రూట్స్

తెల్లవారు జామున సహర్‌లో తీసుకునే ఆహారంలో తగినన్ని డ్రైఫ్రూట్స్ (ఎండు ఫలాలు), పాలు, మాంసం, గోధుమ రొట్టెలు ఉంటాయి. కేవలం ఆహారం, రొట్టెలు తీసుకుంటే వాటి ప్రభావం కొన్ని గంటలు మాత్రమే ఉంటుంది. 12గంటల పాటు ఆహారం నీళ్లు తీసుకోకుండా ఉండాలంటే డ్రైఫ్రూట్స్‌కు ప్రాధాన్యం ఉంటుంది. వీటిని అరబ్బుదేశాల నుంచి తెప్పించి అమ్ముతారు.

హాట్‌హాట్‌గా సేమ్యా

రంజాన్ నెలలో ముస్లిం సోదరులు సాయంత్ర వేళలలో హలీం ఎక్కువగా ఆరగిస్తారు. అయితే ఈ ప్రాంతంలో మాత్రం దాని బదులుగా సేమ్యాను ఎక్కువగా వాడుతారు. జామియా మసీదులో సాయంత్రం ఇఫ్తార్‌లో ఎక్కువగా సేమ్యా తింటారు. దీంతో పాటుగా గంజి రూపంలో ఉండే పిండి పదార్థాన్ని తయారుచేస్తారు. బియ్యపు పిండి, కరివేపాకు, కొత్తిమీర, టమాటతో కలిపి పెద్ద పాత్రలో ఉడిచించి, బూందీ వేసి ఆరగిస్తారు. సేమ్యా ఖరీదు కేజీ రూ.150ల నుంచి రూ.200ల వరకు ఉంటుంది.

వంశధార జలాలు శివారు ప్రాంతాలకు ఎప్పడిస్తారు?


వంశధార రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

హిరమండలం: వంశధార జలాలను శివారు ప్రాంతాలకు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు డిమాండ్ చేశారు. శనివారం సీపీఎం బృందం గొట్టా బ్యారేజీ, వంశధార రిజర్వాయర్‌లను పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొట్టా బ్యారేజీని ఆధునీకరించడంతో పాటు కాలువల మరమ్మతులు చేపట్టాలని కోరారు. దీనివల్ల లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించవచ్చన్నారు. వంశధార రిజర్వాయర్‌కు అనుసంధానంగా నేరడి వద్ద బ్యారేజీ ఎప్పుడు కడతారని ప్రశ్నించారు. జిల్లాకు చెందిన అచ్చెన్నాయుడు వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్నా జిల్లాకు ఎటువంటి ప్రయోజనం లేకుండాపోతోందన్నారు. తక్షణం గొట్టాలో ఎత్తిపోతల పథకం నిర్మాణం పూర్తిచేసి రిజర్వాయర్‌కు నీటిని మళ్లించాలన్నారు. ఒడిశాతో సరిహద్దు జలాల సమస్యను పరిష్కరించి నేరడి బ్యారేజీ నిర్మాణం పూర్తిచేయాలన్నారు. వంశధార జలాలు శివారు ప్రాంతాలుగా ఉన్న ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాలకు అందడం లేదన్నారు. వంశధార-నాగావళి నదుల అనుసంధానాన్ని పూర్తిచేయాలని కోరారు. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేయాలన్న డిమాండ్‌తో ఏప్రిల్ 5న ప్రజాసంఘాలతో కలిసి రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటుచేస్తున్నట్టు ప్రకటించారు. కార్యక్రమంలో సీపీఎం కార్యవర్గ సభ్యులు మోహనరావు, పోలాకి ప్రసాద్, సిర్ల ప్రసాదరావు, సూరయ్య, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నాటిక ప్రదర్శనలు అదరహో..


కొత్తతరం కొడుకులు నాటికలో ఓ సన్నివేశం

శ్రీకాకుళం కల్చరల్ : జిల్లా కేంద్రంలోని బాపూజీ కళామందిర్‌లో సుమిత్రా కళాసమితి ఆధ్వర్యంలో ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమంతు చిన్నరాములు స్మారక జాతీయ స్థాయి నాటిక పోటీల్లో భాగంగా రెండో రోజు శనివారం ప్రదర్శించిన మూడు నాటికలు చక్కటి సందేశంతో ఆకట్టుకున్నాయి. చైతన్య కళాభారతి(కరీంనగర్) ఆధ్వర్యంలో ప్రదర్శించిన 'స్వప్నం రాల్చిన అమృతం' నాటిక భార్యాభర్తల అనుబంధాలను కళ్లకు కట్టింది. పిఠాపురం శ్రీమణికంఠ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన 'కొత్తతరం కొడుకులు', కత్రపాడుకు చెందిన ఉషోదయ కళానికేతన్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన 'కిడ్నాప్' నాటికలు ఆలోచింపజేశాయి. కార్యక్రమంలో డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు, సుమిత్రా కళాసమితి అధ్యక్ష కార్యదర్శులు ఇప్పిలి శంకర శర్మ, గుత్తు చిన్నారావు, లోకనాథం రామలింగేశ్వరరావు, నక్క శంకరరావు, మండవిల్లి రవి, కిల్లా ఫల్గుణరావు, మూర్తి, కె. సురేష్, కొంక్యాన మురళీ, టి.నీరజా సుబ్రహ్మణ్యం, రాజు, బి.ఎ.మోహనరావు, ప్రధాన విజయరామ్, మొట్టపోలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

వాన కురిసింది..


చిరుజల్లు పడటంతో తడిసిన రోడ్డు

ఇచ్ఛాపురం టౌన్: ఇచ్ఛాపురంలో శనివారం సాయంత్రం వర్షం చిరుజల్లు పడటంతో వాతావరణం చల్లబడింది. ఉదయం నుంచి ఆకాశంలో మబ్బులు కమ్ముకున్నాయి. వారం రోజులుగా ఎండతీవ్రత ఉండటంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు.

కాపీయింగ్‌పై సమగ్ర విచారణ జరపాలి


సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

- టీచర్ల సస్పెన్షన్ ఏకపక్షమే
- డీఈఓ వ్యవహార శైలిని తప్పుబట్టిన ఉపాధ్యాయ సంఘాల నాయకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: కుప్పిలి మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రంలో 14 మంది టీచర్ల సస్పెన్షన్ వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం శ్రీకాకుళం నగరంలోని ఎన్జీవో హోమ్ వేదికగా జిల్లాలోని ఉపాధ్యాయ సంఘాల నాయకులంతా ఐక్య ఉపాధ్యాయ వేదికగా బలివాడ ధనుంజయరావు, పిసిని వసంతరావు, మజ్జి మదన్‌మోహన్ రావు, గొంటి గిరిధర్, తంగి మురళీమోహన్ నేతృత్వంలో అత్యవసర సమావేశమయ్యారు. సస్పెన్షన్‌కు గురైన హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. అంతకుముందు పరీక్ష కేంద్రంలోని పలువురు విద్యార్థులు, తల్లిదండ్రులతో మాట్లాడారు. డీబార్‌ైన విద్యార్థులు, తల్లిదండ్రులతో మాట్లాడి వాస్తవాలను తెలుసుకున్నామని, ఈ విషయంలో డీఈఓ తిరుమల చైతన్య తీరు సరిగ్గా లేదని చెప్పారు. అన్యాయాలు, అవకతవకలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే డీఈఓపై ముందుగా క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డీఈఓ ఆరోపిస్తున్నట్టు డబ్బు వెదజల్లడంపై నిజానిజాలు తేల్చి దోషులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వివిధ ఉపాధ్యాయ సంఘ నాయకులు చౌదరి రవీంద్ర, ఎస్వీ రమణమూర్తి, సూర పాపారావు, శీపాన ముకుందరావు, పి.కాశీ విశ్వనాథం, వి.శరతబాబు, దుప్పల శివరాంప్రసాద్, కె.రాజేశ్వరరావు, ఎంవీ రమణ, జి.మల్లేసు, ఏఎస్ మూర్తి, బి.వెంకటేశ్వరరావు, పి.ఫల్గుణరావు, కె.నూకరాజు, ఎస్.రమేష్‌బాబు, జి.దామోదర రావు, మెట్ట తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

పోరాటయోధుడు మామిడి అప్పలసూరి

- జీవిత చరిత్ర పుస్తకావిష్కరణ నేడు


మామిడి అప్పలసూరి (ఫైల్)

నరసన్నపేట: పోరాటాలతోనే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని ప్రజా ఉద్యమాలు చేస్తూ, మరోవైపు శ్రీకాకుళం గిరిజనోద్యమంలో తనకంటూ ప్రత్యేక స్థానం పొందిన పోరాట యోధుడు మామిడి అప్పలసూరి. యుక్త వయసు నుంచి మరణించే (1997 మార్చి 21) వరకూ ప్రజల పక్షాన నిలుస్తూ అనేక ఉద్యమాల్లో భాగస్వాములయ్యారు. నక్సల్‌బరీ నేత చారు మజుందార్, పీపుల్స్ వార్ పార్టీ వ్యవస్థాపకులు కొండపల్లి సీతారామయ్యలతో కలిసి పనిచేశారు. శ్రీకాకుళోద్యమంలో అశువులు బాసిన వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం, పంచాది కృష్ణమూర్తి, సుబ్బారావు పాణిగ్రహి వంటి నేతలతో పలు సమావేశాల్లో పాల్గొని కేంద్ర కమిటీ సభ్యునిగా మంచి గుర్తుంపు పొందారు. ఆదివారం ఆయన వర్ధంతి సందర్భంగా కోమర్తిలో అమరవీరుల స్థూపం వద్ద జీవిత చరిత్ర పుస్తకావిష్కరణ జరగనుంది. కోమర్తి అమరవీరుల స్మారక కమిటీ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో సినీ నటుడు, దర్శకుడు పీపుల్‌స్టార్ ఆర్.నారాయణమూర్తి, వామపక్షాల నాయకులు, ఎంఎల్ పార్టీల ప్రతినిధులు, కవులు, కళాకారులు, మేధావులు, అప్పలసూరి అభిమానులు హాజరు కానున్నారు.

బీసీ రుణాల దరఖాస్తు గడువు పెంపు

శ్రీకాకుళం పాతబస్టాండ్: బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీతో కూడిన రుణాలు మంజూరు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు గడువు పెంచినట్టు బీసీ కార్పొరేషన్ ఈడీ ఆర్.గడ్డెమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఈ నెల 25 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. కాపు కమ్యూనిటీకి చెందిన రుణాల మంజూరు కోసం దరఖాస్తుదారుల గరిష్ఠ వయోపరిమితిని 50 నుంచి 60 ఏళ్లకు పెంచినట్లు చెప్పారు. దీని ప్రకారం 21 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సు గల వారు పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని పేర్కొన్నారు.

● తప్పిన పెనుముప్పు


లావేరు మండలం తాళ్లవలస జాతీయ రహదారిపై సర్వీస్ రోడ్డుపైన ఆగి ఉన్న ఆర్టీసీ పల్లెవెలుగు బస్సును వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ సమయంలో బస్సులో ప్రయాణికులు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఘటన తర్వాత బస్సు రోడ్డుకు అడ్డంగా తిరగటంతో కొద్ది సమయం ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.

–ఎచ్చెర్ల

ఎందుకీ సమా'వేషాలు'..?


తీర్మానం కాపీని ఎంపీడీఓకు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

టెక్కలి: గ్రామాల్లో అభివృద్ధి చేయడానికి అధికారం, గౌరవం ఇవ్వకుండా ప్రజలకు ఉపయోగం లేని సర్వసభ్య సమావేశాలు నిర్వహించడం ఎందుకని కోటబొమ్మాళి మండలం ప్రజాప్రతినిధులు సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించారు. కోటబొమ్మాళి మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీడీఓ ఫణీంద్రకుమార్ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ రోణంకి ఉమా, జెడ్పీటీసీ దుబ్బ వెంకట్రావు, వైస్ ఎంపీపీలు బోయిన నాగేశ్వరరావు, దుక్క రోజా, విప్ బొడ్డు అప్పన్నతో పాటు సభ్యులంతా ఈ సమావేశాన్ని బహిష్కరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పంచాయతీల అభివృద్ధి పనుల అంచనాల్లో కక్షపూరితంగా వ్యవహరించడం, గ్రామాల అభివృద్ధికి అధికార యంత్రాంగం సహకరించకపోవడం, ఎంపీటీసీల గౌరవ వేతనాలు ఇవ్వకపోవడం, సమావేశాలకు కనీస సమాచారం, ప్రోటోకాల్ పాటించకపోవడాన్ని నిరసిస్తూ సభ్యులంతా సమావేశాన్ని బహిష్కరిస్తూ ఏకవాక్య తీర్మానాన్ని ఆమోదించారు. అనంతరం ఎంపీడీఓ ఫణీంద్రకుమార్‌కు తీర్మానం కాపీను అందజేశారు.